క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన



శిబిరంలో పాల్గొన్న ఎంపీపీ, తహసీల్దార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని రాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ మందపల్లి స్వర్ణలత ప్రారంభించగా, 64మంది దాతలు రక్తదానం చేశారు. అనంతరం వారికి ఆమె ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, తహసీల్దార్ రాజలింగు, నాయబ్ తహసీల్దార్ హరిత, ఎంపీడీవో అబ్దుల్‌హై, ఎంపీవో శ్రీనివాసరెడ్డి, వైద్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీ బ్రహ్మోత్సవాల కార్యదర్శిగా భాగ్యలక్ష్మి



మంచిర్యాలటౌన్: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మంచిర్యాలకు చెందిన కట్ల భాగ్యలక్ష్మిని ఎంపిక చేశారు. ఏప్రిల్ 9, 10 తేదీల్లో 48గంటల పాటు తిరుపతిలో ప్రపంచ రికార్డు సభలను శ్రీశ్రీ కళావేదిక, చేజర్ల ఇంద్రాణి ట్రస్టు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని, ఈ కార్యక్రమాలకు తనను ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందని భాగ్యలక్ష్మి తెలిపారు.

అలరించిన 'లర్నింగ్ ఫెస్ట్'



నృత్యం చేస్తున్న బాలికలు

తాండూర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని తాండూర్ విద్యాభారతి సంస్థల డైరెక్టర్ సురభి శరత్‌కుమార్ అన్నారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శనివారం లర్నింగ్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. పాఠ్యపుస్తకాల్లోని ప్రతీ అంశాన్ని వేదిక ద్వారా ప్రయోగాత్మకంగా చేసి చూపించడం కార్యక్రమం యొక్క లక్ష్యమన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జర్నలిస్ట్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి'

చెన్నూర్: మండలంలోని సుద్దాలలో శుక్రవారం రాత్రి బీజేపీ నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశం కవరేజ్ కోసం వెళ్లిన రిపోర్టర్ రాజుపటేల్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మంచిర్యాల జిల్లా జర్నలిస్ట్ సంఘాల నాయకులు చెన్నూర్ సీఐ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. జర్నలిస్ట్ సంఘాల నాయకులు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్ట్‌తో పాటు కెమెరామెన్‌లపై దాడితో పాటు వాహనాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్‌చౌదరి, ఆకుల రాజు, మానిశెట్టి మాంతయ్య, చెట్ల రమేశ్, శ్రీనివాస్, తౌసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల పత్రాలు అందజేత

మంచిర్యాలటౌన్: జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో పనిచేస్తూ మరణించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు సీనియారిటీ ప్రకారం ముగ్గురికి శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి వివిధ ఎంపీడీవో కార్యాలయాల్లో ఆఫీస్ సబార్డినేట్లుగా నియమిస్తూ నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ తొంగల సత్యనారాయణ, సీఈవో కె.నరేందర్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వచ్చే నెల 4 నుంచి 8 వరకు నిర్వహించే ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను శనివారం ఆలయంలో ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

బీసీల డిమాండ్‌లపై తీర్మానం చేయాలి

పాతమంచిర్యాల: చత్తీష్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో ఈ నెల 26, 27, 28తేదీల్లో జరిగే జాతీయ కాంగ్రెస్ ప్లీనరీలో బీసీల న్యాయమైన డిమాండ్‌లపై తీర్మానం ప్రవేశపెట్టాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.



హెల్పింగ్ హ్యాండ్..!

మంచిర్యాలలో నాలుగేళ్ల కిందట ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఏదో ఒక సేవా కార్యక్రమం చేయాలని తీర్మానించుకున్నారు. చదువుకుంటున్న తరుణంలోనే ఆ ఏడుగురి మాటలు ఆచరణలోకొచ్చాయి. వారి సేవా కార్యక్రమాలు చూసి తోటి వారెందరో తోడయ్యారు. ప్రస్తుతం ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ చదువుతున్న వారే 40మంది సేవా కార్యక్రమాలు విస్తృతం చేశారు. నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. హంగు ప్రచార ఆర్భాటాలు లేకుండా ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా రుచికరమైన భోజనం పెడుతూ, మంచిర్యాల జాఫర్‌నగర్‌కు చెందిన టీం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆపన్న 'హస్తం' అందిస్తూ పేదల ఆకలి తీరుస్తోంది. ఈ వివరాలతో కథనం..

– మంచిర్యాలఅర్బన్

ఆలోచన తట్టిందిలా..

మంచిర్యాలకు చెందిన నదీం హుస్సేన్ ఐదేళ్ల కిందట ఇంటర్ చదివే క్రమంలో ఏడుగురు స్నేహితులతో కలిసి హిందూ, ముస్లింల ఐక్యతకు కృషి చేసేలా సేవా కార్యక్రమాలు చేయాలని ఆలోచన చేశారు. ఇందుకు మిగిలిన దోస్తులు సహకరించారు. నిరుపేద కుటుంబాలకు పెళ్లికి అవసరమైన సామగ్రి అందించాలని సంకల్పించారు. వీరు తోచినంత డబ్బులు కూడబెట్టుకుని మిగిలిన డబ్బుల కోసం వాట్సప్ గ్రూప్‌లో సమాచారాన్ని ఇచ్చేవారు. దాతల సహకారంతో 12మంది పేదలకు పెళ్లికి అవసరమైన రేషన్, ఇతరత్రా సామగ్రిని అందించారు.

కరోనా సమయంలో..

కరోనా సమయంలో ఆకలితో అలమటిస్తున్న వారికి సాయం చేయాలని ముందుకు కదిలారు. వీరికి తోడు మరికొంత మంది తోడయ్యారు. దాదాపు నెలరోజులకు పైగా బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, చౌరస్తాలో ఆహారాన్ని అందించారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ముగ్గురికి దహన సంస్కారాలు చేశారు. 2022లో టీం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీని రిజిస్ట్రేషన్ చేసి తర్వాత పేదకుటుంబానికి ఇళ్లు, ప్రతి ఆదివారం ఆహారం అందిస్తూ మరింతగా ముందుకు సాగుతున్నారు.



ప్రతి ఆదివారం రుచికరమైన భోజనం..

ఏడాది కాలంగా క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం పేదలకు ఆకలి తీరుస్తూ వస్తున్నారు. ఒక్కో వారం ఒక్క తీరుగా రుచికరమైన ఆహారం (ఆలు బిర్యాణి, ఉప్మా, పులిహోర, పలురకాలు) అందిస్తున్నారు. 200 నుంచి 250మందికి ఆహారంతో కడుపునింపుతున్నారు. మంచిర్యాల ప్రభుత్వాసుపత్రి ఎదురుగా రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో భోజనం పెడుతున్నారు. పేద మహిళకు ఉపాధి అందించాలనే సంకల్పంతో వంట తయారు చేసినందుకు, ఆర్థిక తోడ్పాటునందించటం విశేషం. మొదట కాస్త ఆర్థికంగా ఇబ్బందిపడినా సామాజిక మాధ్యమంలో చేస్తున్న కార్యక్రమాలకు దాతలు స్పందిస్తూ వస్తున్నారు.

ఐక్యత చాటేందుకు...



అప్పట్లో ఏ కారణం లేకపోయినా హిందు, ముస్లిం తగాదాలు చోటు చేసుకోవటం బాధనిపించేది ఐక్యతా కోసం సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నాం. రెండు సంవత్సరాలుగా ప్రతి ఆదివారం ఆహారం అందజేస్తూ వస్తున్నాం. ప్రారంభ దశలో విరాళాలు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం సోషల్ మీడియా ఫండింగ్, మా సోదరుల ద్వారా మాకు తగినంత విరాళాలు అందుతున్నాయి. దాదాపు నలభై మంది సభ్యులకు చేరింది మా సంస్థ. నేటి యువత ప్రతిసారీ మొబైల్‌తో బిజీగా ఉంటున్నారు. ఆధునికతకు ఆలోచనలు జోడిస్తే సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు ఎన్నో చేయొచ్చు.

– నదీమ్ హుస్సేన్, సంస్థ అధ్యక్షుడు

సంతోషంగా ఉంది



సెల్‌ఫోన్‌లో మునిగి తేలుతున్న యువత కొంత దృష్టి సారిస్తే మంచి పనులు చేయవచ్చు. సమాజ సేవే ధ్యేయంగా సంస్థను ఏర్పాటు చేశాం. నాలుగు ఏళ్లుగా దాతల సహకారాలతో పేదలకు ఆహారం అందించటం ఎంతో సంతోషంగా ఉంది. సభ్యులమంతా సమన్వయంతో మున్ముందు కూడా మరిన్ని కార్యక్రమాలు చేపడుతాం.

– మొహమ్మద్ సమీర్, సంస్థ కోశాధికారి

వాట్సప్‌తో బాధితులకు బాసటగా..

జూలై 2022లో వరదల్లో వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్న పేద కుటుంబం ఆసియా ఖాతూన్ ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఇద్దరు ఆడపిల్లల పోషణ భారంగా ఉన్న విషయం టీం హెల్పింగ్ హ్యాండ్ దృష్టికి తీసుకురాగా సామాజిక మాధ్యమాల ద్వారా రూ.4లక్షల విరాళాలు సేకరించి ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. గణతంత్ర దినోత్సవం రోజు గృహ ప్రవేశం చేపించారు.



అభివృద్ధే ధ్యేయంగా పాలన

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగుతోందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో సాయిబాబ ఆలయం నుంచి రంగంపేట వరకు రోడ్డు విస్తరణకు గాను టీయూ ఎఫ్ఐడీసీ నిధులు రూ.2.80కోట్ల నిధులతో శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునిత, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, నాయకులు బొలిశెట్టి కిషన్, తిరుపతి పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని పలు రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు. పట్టణ ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, పనులను వెంటనే చేపట్టి త్వరగా ముగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, కమిషనర్ వెంకటేశ్, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అడ్డుకున్న కాలనీవాసులు

లక్సెట్టిపేట: పట్టణంలోని ఏడో వార్డులో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావును భగత్‌సింగ్‌నగర్ కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మరిచిపోయారని మండిపడ్డారు. కాలనీలో చాలా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని నిలదీశారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలుపడంతో శాంతించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

మంచిర్యాలఅగ్రికల్చర్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ సీఐటీయూ అనుబంధ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం హాజీపూర్ మండలం రాపల్లి నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ మాట్లాడుతూ పీఆర్సీ ప్రకారం వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.5లక్షలు ఎక్మిడే ఇన్స్‌రెన్స్ కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె పోరాటం, పెద్ద ఎత్తు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆందోళన అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ పాదయాత్రకు మద్దతుగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి రమేష్, నాయకులు తిరుపతి, మల్లేష్, శంకర్,మహేందర్, సీపీఎం నాయకులు సంకె రవి, దూలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

మంచిర్యాలఅర్బన్: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని ప్రతి పాఠశాలలో ఫిబ్రవరి 28న సైన్స్ సంబురాలను ఘనంగా నిర్వహించాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించుట, పాఠశాలలకు సమీపంలో పరిశోధకాలు, పరిశోధన సంస్థలో పనిచేసే వారిని ఆహ్వానించాలన్నారు. విజ్ఞాన అంశాలపై అవగాహన, ఆసక్తికర సైన్స్ అంశాలు బోధించటం, ప్రదర్శించటం, విజ్ఞాన ప్రదర్శన మేళా నిర్వహణ సైన్స్ రంగోలి వంటి అనేక కార్యక్రమాలు ఆయా పాఠశాలలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. నిర్వహించిన కార్యక్రమాలను డాక్యుమెంట్ రిపోర్టులా తయారు చేసి, డీఎస్‌వో మధుబాబుకు పంపించాలన్నారు.

లీకైన గూడెం లిఫ్టు పైప్‌లైన్..!

- రాత్రి వరకు మరమ్మతులు పూర్తి
- ఒక మోటారు ద్వారా నీరు విడుదల



లీకైన చోట మరమ్మతు చేస్తున్న దృశ్యం

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ తానిమడుగు సమీపంలో శుక్రవారం రాత్రి లీకయ్యింది. దీంతో లీకేజీని గమనించిన అధికారులు, సిబ్బంది, వెంటనే లిఫ్టు మోటార్లు ఆఫ్ చేసి, నీటి సరఫరాను నిలిపివేశారు. యుద్ధ ప్రాతిపదికన శనివారం మరమ్మతులు చేపట్టి, సాయంత్రం వరకు మరమ్మతులు పూర్తిచేశారు. రాత్రి ఒక మోటారు ఆన్‌చేసి, నీటిని విడుదల చేశారు. ప్రస్తుత యాసంగికి నీటిని విడుదల చేసినప్పటి నుంచి ఐదు సార్లు పైప్‌లైన్ లీకవడం, 15సార్లు టెక్నికల్ సమస్యలు తలెత్తడంతో, పలుమార్లు నీటి సరఫరాకు అంతరాయం కలిగింది.

గొర్రెల పెంపకం కోసం సబ్సిడీ రుణాలు



గొర్రెలకు టీకాలు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి

భీమారం: గ్రామాల్లో గొర్రెల పెంపకం కోసం సబ్సిడీ రుణాలు అందించనున్నట్లు జిల్లా పశువైద్యాధికారి రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని కాజిపల్లిలో శనివారం గొర్రెల కాపరులకు రుణాలపై అవగాహన కల్పించారు. అనంతరం నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ము అశోక్ యాదవ్, మండల పశువైద్యాధికారి రాకేశ్ శర్మ, సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

నెన్నెల: నట్టల నివారణ మందులతో జీవాల్లో ఎదుగుదల ఉంటుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ అన్నారు. మండలంలోని గంగారాంలో నట్టల నివారణ మందుల పంపిణీలో పాల్గొని రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ సుధ, నాయకులు శ్రీనివాస్, పశువైద్యాధికారి దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గిరిజన క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల ఎంపిక

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం మంచిర్యాల జిల్లా స్థాయి గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహించగా ఏటీడీవో చిరంజీవి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బండ జీవరత్నం ప్రారంభించారు. ఎంపికైన విద్యార్థుల్లో అమ్మాయిలు వాటర్ స్పోర్ట్స్ స్కూల్ అకాడమీ బోయినపల్లి, టీడబ్ల్యూ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ఆసిఫాబాద్‌కు వెళ్లాల్సి ఉంటుందని, బాలురు టీడబ్ల్యూ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ఉట్నూర్‌కు వెళ్లాల్సి ఉంటుందని, బాలురు 38మంది, బాలికలు 62మంది ఎంపికయ్యారని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

లక్సెట్టిపేట: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా హెచ్ఐవీ నియంత్రణాధికారి అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక సబ్‌జైల్‌లో శనివారం హెచ్ఐవీ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించి సుఖవ్యాధులు, హెచ్ఐవీ, టీబీలపై అవగాహన కల్పించారు.

డబుల్ బెడ్‌రూం జాబితాలో చేర్చాలని వినతి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పేద ప్రజలు డబుల్ బెడ్‌రూం ఇంటి నిర్మాణం కోసం కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకున్న వారిని జాబితాలో చేర్చాలని ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

అభ్యంతరాల స్వీకరణ

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం జాబితాను మున్సిపల్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై శనివారం అతికించినట్లు, ఏవైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీలోపు మున్సిపల్ కార్యాలయంలోని సెక్షన్ క్లర్క్ ఎం.అంజయ్యకు దరఖాస్తులు అందించాలని తెలిపారు.

మ్యాన్‌రైడింగ్ నడిపించాలి

శ్రీరాంపూర్: ఆర్కే 7గనిలో నిలిచిపోయిన మ్యాన్ రైడింగ్‌ను తిరిగి నడిపించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి డిమాండ్ చేశారు. గనిపై శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. మ్యాన్‌రైడింగ్ పని చేయకపోవడంతో సర్ఫేస్ నుంచి కార్మికులు భూగర్భంలోకి దిగడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రీన్ ఆడిట్

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'పచ్చదనం–పరిశుభ్రత'పై శనివారం గ్రీన్ ఆడిట్ చేపట్టారు. కళాశాలలో పర్యావరణ పరిరక్షణతో పాటు మొక్కల పెంపకం, వృథా నీటిని సద్వినియోగం చేసుకోవడం తదితర అంశాలను గ్రీన్ ఆడిట్ సభ్యుడు లక్సెట్టిపేట మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా పరిశీలించి కళాశాలకు ఏ గ్రేడ్ ప్రకటించారు.

బీసీలకే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్ పాగాకు యాదగిరి ప్రాంగణంలో తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో మంచిర్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే అంశంపై నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలన్నారు.

ఊరూరా ప్రజాగోస–బీజేపీ భరోసా

భీమిని: మండలంలోని బిట్టూర్‌పల్లిలో 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్నర్ మీటింగ్ శనివారం నిర్వహించారు. బెల్లంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు సుదర్శన్ హాజరై మాట్లాడారు.

రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక పరిశోధనా సంస్థ(ఎస్‌సీఈఆర్టీ) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర సెమినార్‌కు జిల్లా కేంద్రానికి చెందిన అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యుఆర్ఎస్)కు చెందిన ఉపాధ్యాయురాలు త్రిలోచనా పల్లవి ఎంపికయ్యారు. జాతీయ సైన్స్ దినోత్సవం 28న హైదరాబాద్‌లో ప్రదర్శన ఇవ్వనుంది.

సైకాలజీలో సతీశ్‌కు డాక్టరేట్

జన్నారం: మండలంలోని పొనకల్‌కు చెందిన కస్తూరి సతీశ్‌కుమార్‌కు సైకాలజీలో గౌరవ డాక్టరేట్ లభించింది. మల్టిపుల్ ఇంటలీజెన్స్ టెస్ట్ కెరీర్ కౌన్సెలింగ్ చేస్తూ విద్యార్థులకు ధైర్యం నింపి, వారికి దిశా నిర్దేశం చేస్తున్నందుకు గాను ఇండియన్ సెల్ఫ్ గవర్నమెంట్ డాక్టరేట్ యూనివర్సిటీ వారు 'డాక్టరేట్'తో సత్కరించారు.

జాతీయ కాంగ్రెస్ ప్లీనరీకి జిల్లా నేతలు

మంచిర్యాలటౌన్: జాతీయ కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీని చత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్‌లో నిర్వహించగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు ఉమ్మడి జిల్లా నేతలు శనివారం హాజరయ్యారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాహుల్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఏయిమ్స్ ఆసుపత్రిలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా అదనపు కలెక్టర్ రాహుల్, అసిస్టెంట్ కలెక్టర్ గౌతమి, డీసీపీ సుధీర్ ఆర్ కేకన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా 150యూనిట్ల రక్తాన్ని తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల కోసం సేకరించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు యగ్గన శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ చందూరి మహేందర్ పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు వినతి

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శనివారం రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావును కోరారు. నిధుల మంజూరు కోసం వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే చిన్నయ్య ప్రకటించారు.

'ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారు'



శ్రీరాంపూర్: ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తే టీఆర్ఎస్ నేతలు దాడులు చేస్తున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి తెలిపారు. స్థానిక బస్టాండ్ వద్ద శనివారం ఆయన ప్రజాగోసా-బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెన్నూరులో తమ పార్టీ వారిపై బాల్కసుమన్ అనుచరులు దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రఘునాథ్‌రావు, రంగారావు, ఆనంద్‌కృష్ణా, సత్రం రమేశ్, ఈర్ల సదానందం, కుర్రె చక్రి, తిప్పని భీమయ్య, కొండ వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ షిఫ్ట్ ఇన్‌చార్జీల నియామకం

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై శనివారం ఏఐటీయూసీ నాయకులు సమావేశమై షిఫ్ట్ ఇన్‌చార్జీలను నియమించారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి ఆధ్వర్యంలో సీరిలే షిఫ్ట్ ఇన్‌చార్జీగా కొక్కెర సంతోష్, అసిస్టెంట్ కార్యదర్శిగా ఏ.సందీప్, ప్రెస్ అండ్ మీడియా కార్యదర్శిగా పార్వతి సురేష్‌ను నియమించినట్లు ప్రకటించారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనలో ఏఐటీయూసీకి సుదీర్ఘ చరిత్ర ఉందని కార్మికులకు అండగా ఉంటూ ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో గని అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ మీనుగు లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు



కాసిపేట గనిపై సమావేశమైన నాయకులు

సద్వినియోగం చేసుకోండి

రామకృష్ణాపూర్: బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సింగరేణి ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో ఆదివారం నిర్వహించే మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాట్లను శనివారం బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. మెడికల్ క్యాంపులో చెస్ట్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాలకు చెందిన వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని పట్టణ ప్రజలు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ క్యాంప్ నిర్వాహకుడు, 2వ వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ కోరారు. బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, యాకూబ్‌అలీ, జాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్లను సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏరియాలోని జీఎం ఆఫీస్ ఎదుట కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన నిర్వహించారు. అనంతరం సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఆసీఫ్‌కు వినతిపత్రం అందించారు. ఖాళీ క్వార్టర్లు కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మిక సంఘం బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి దూలం శ్రీనివాస్, సంఘం నాయకులు మహేందర్, కళావతి, విజయలక్ష్మి, నరేష్, రాజేష్ తదితరులు ఉన్నారు.

చెట్ల కిందే ఐఎల్‌ఏ శిక్షణ



చెన్నూర్: అంగన్‌వాడీ టీచర్లకు ఐఎల్ఏపై అవగాహన ఉండాలని సీడీపీవో మనోరమ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద గల చెట్ల కింద అంగన్‌వాడీ టీచర్లకు ఐఎల్ఏపై శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతుల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. సుమారు రెండు గంటల పాటు హాల్ లేకపోవడంతో చెట్ల కింద శిక్షణ తరగతులు నిర్వహించారు.